
కథ

# అనుమానం పెనుభూతం

- ఆదోని లలిత



గ్రాఫిక్స్ భాస్కర్

జయ వరండాలో కూర్చుని ప్రతాప్‌కోసం ఎదురు చూస్తుంది. ఆఫీసు నుండి సాయంకాలం ఆరు గంటలకంతా వచ్చే ప్రతాప్ ఆ రోజు రావటం కొంచెం ఆలస్యమయింది. ఎవరి కోసమైనా, దేనికోసమైనా నిరీక్షించటమన్నది ఒక విధమైన శిక్ష జీవితంలో. నిరీక్షణలో నిముషాలు గంటలుగా సాగుతుంటాయి. తన ఆడపడుచు ప్రీతికూడా కాలేజి నుండి ఇంకా రాలేదు. కొన్ని రోజులుగా ప్రీతి కాలేజి నుండి తరచూ ఆలస్యంగా రావటం, ఇంట్లో వున్నంత సేపూ ఏదో పరధ్యానంగా వుండటం జయ గమనిస్తూనే వుంది. అంతలో ప్రీతి వచ్చింది. ఆలస్యంగా వచ్చినందుకు వదిన ఏమైనా అడుగుతుందేమోన్న సంశయంతో కూడిన చిరునవ్వు ఆమె ముఖంలో. ప్రీతిని చాలా ఆప్యాయంగా చూసుకుంటుంది జయ. ప్రీతికి కూడా వదినంటే అమితమైన ప్రేమ, గౌరవం. ప్రీతి దగ్గరికి రాగానే

''ఏమ్మా! ఆలస్యమయింది'' అంటూ లేచి ఆమె చేయి పట్టుకుని ఆప్యాయంగా లోపలికి తీసికెళ్ళింది. తరువాత ''ప్రీతీ! వాష్ చేసుకుని రామ్మా! టిఫిన్, కాఫీ రెడీగా వున్నాయి'' అంది. అందుకు ప్రీతి

''అన్నయ్య ఇంకా రానట్టుంది. అన్నయ్యను కూడా రానీయండి వదినా! అందరం కలిసి తినొచ్చు'' అని ప్రీతి అంటుండగానే ప్రతాప్ లోపలికొచ్చి చెల్లి మాట విని ఆమె వేపు సంతోషంగా చూశాడు.

టిఫిన్, కాఫీల తరువాత,

''చిట్టితల్లీ! పరీక్షలు దగ్గరికొస్తున్నాయి. బాగా చదువుతున్నావు కదూ?'' అని అడిగాడు ప్రతాప్. చెల్లి అంటే ప్రతాప్‌కు ప్రాణం. తల్లీ తండ్రీ పోయిన తరువాత అన్నీ తానై ఆమెను పెంచాడు. అన్న ప్రశ్నకు సమాధానంగా నవ్వుతూ తలూపింది ప్రీతి. మౌనంగా తలూపిన ప్రీతిని జయ మురిపెంగా చూస్తూ,

''అవునూ! మీకు ప్రీతి ఇంకా ఎంతకాలం చిట్టితల్లిలా కనిపిస్తుంది. ఇప్పుడు ఫైనల్ ఇయర్ అయిపోతూంది. మంచి సంబంధం కోసం ఇప్పట్నుంచే ప్రయత్నించాలి. నేనూ నా ఫ్రెండ్స్‌తో చెప్పాను. మీరూ...'' అని జయ అంటుండగానే ప్రీతి అక్కడి నుండి లేచి తన గదివేపు దారితీసింది. ఆమె సిగ్గుపడి అక్కడి నుంచి వెళ్ళిపోయిందనుకున్నాడు ప్రతాప్. కొన్ని రోజులుగా ఆమె నడవడికను గమనిస్తున్న జయకు మరో విధంగా అనిపించింది.





మరుసటి రోజు ప్రీతి కాలేజి నుండి త్వరగా వచ్చి, టిఫిన్, కాఫీ తీసుకున్న తరువాత

''వదినా!'' అంటూ ఏదో చెప్పబోయి ఆగిపోయింది నేల చూపులు చూస్తూ.


''ప్రీతీ! ఏమ్మా! ఏదో చెప్పబోయి ఆగిపోయావు. ఏదైనా నాతో చెప్పటానికేంటి? నేను నీకు వదిననేమో? నీవు మాత్రం నాకు కూతురివి'' అంటూ ప్రీతి చేయి తన చేతిలోకి తీసుకుంది ఆప్యాయంగా.

''వదినా! నా క్లాస్‌మేట్ రూప వాళ్ళ బ్రదర్ మధు ఇంజనీరు. కొత్తగా జాబ్‌లో చేరారు. నేను అప్పుడప్పుడూ రూప వాళ్ళింటికెళుతుంటాను కదూ! అలా మధుతో పరిచయమయింది.

మేమిద్దరం... ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు వదినా! మీరే

## 'గజ' గమనం

ఆహా! ఏం నడక గురూ? అచ్చం ఏనుగు నడకే అని! మాధురీ 'నేనే' దీక్షిత్, ఎం.ఎఫ్.హుస్సేన్‌ని చూసిన వాళ్ళు అంటున్నారు. కారణం? 'గజగామిని' చిత్రం పూర్తి అయి నా విడుదలవ్వలేదు ఇంత దాకా! ఈ సినిమా 'విడుదల కాకుంటేనే బెస్టు' అని మాధురీ అనుకుందని కొందరూ, కాదు ప్రొడ్యూసర్‌కీ హుస్సేన్ గారికీ మధ్య 'కాసులు' పేరుకు పోవడం వల్లే డిలే అని మరి కొందరూ భావిస్తున్నారు. ఇంతకీ ప్రొడ్యూసర్ 'రిక్కు' మాధురీకి నాటి సెక్రటరీ. సో! ఏదైనా కర్రెక్టే అయివుండ వచ్చుని విశ్లేషకుల వ్యాఖ్య.



ఎలాగయినా అన్నయ్యను ఒప్పించి మా పెళ్ళి ... జరిపించాలి'' అంటూ ధైర్యాన్ని కూడదీసుకుని నెమ్మదిగా తన మనసులోని మాటను వదినతో చెప్పింది ప్రీతి. కొన్ని రోజులుగా ఆమె వాలకాన్ని గమనిస్తున్న జయ ఇలాంటిదేదో జరుగుతుంటుందని ఊహించుకుంది. ప్రీతికి ధైర్యమిస్తున్నట్టు తన చేతిలో వున్న ఆమె చేతిని నొక్కి,

''ప్రీతీ! వాళ్ళింటిలో దీనికి సమ్మతిస్తారా?'' అంది.

''అవును వదినా! అందరికీ ఇష్టమే'' అంది సంభ్రమంగా వదిన కోపపడనందుకు.

''అయితే మధును రేపు సాయంకాలం వచ్చి నన్ను చూడమను. నీకు రేపు సాయంకాలం స్పెషల్ క్లాస్ వుందన్నావు కదూ! దీని గురించి నీవు క్లాస్ మానొద్దు. నీవు క్లాస్ అటెండు చేసిరా. నేను మధుతో మాట్లాడుతాను. మీ అన్నయ్యకు రేపు సాయంకాలం ఏదో మీటింగ్ వుందట. రావటానికి ఎనిమిది గంటలవుతుందన్నారు. నేను మధుతో మాట్లాడిన తరువాత నెమ్మదిగా మీ అన్నయ్యకు చెబుతాను'' అంది జయ. వదిన మాటకు ప్రీతి కనులలో ఆశల నక్షత్రాలు తళుక్కుమన్నాయి.

మరుసటి రోజు సాయంకాలం మధు వచ్చి జయతో మాట్లాడాడు. మధుని చూసి, మాట్లాడిన తరువాత, జయకు మధు, ప్రీతికి అన్ని విధాల తగిన వరుడు అనిపించింది. ఆ కొంత సేపట్లో ఆమె చూపిన ఆదరణ, ఆప్యాయత మధుకెంతో నచ్చింది. ఆమె పట్ల గౌరవభావం ఏర్పడింది. ఆ గౌరవ భావంతోనే, బయలుదేరే ముందు ఆమె చేతులు పట్టుకుని ''నా ప్రేమను సార్థకం చేయాలి తప్పకుండా'' అని అన్నాడు. మధు ఆమె చేతులు పట్టుకుని ఆ మాట అంటున్నప్పుడు, అదే సమయంలో మీటింగ్ కాన్సిల్ అయినందుకు ఇంటికొచ్చిన ప్రతాప్ గుమ్మం దగ్గరికొచ్చి మధు, జయ చేతులు పట్టుకున్న దృశ్యాన్ని చూసి తలుపు చాటుకు తప్పుకున్నాడు. వెంటనే మధు చెప్పిన మాట కూడా స్పష్టంగా వినిపించింది. ప్రతాప్‌కు భూమి తిరిగినట్లనిపించి అతి కష్టంమీద నిలదొక్కుకున్నాడు. జయ ప్రతాప్ రాకను గమనించలేదు. ఆ మాట అన్న తరువాత మధు ఆమె దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాడు. కాఫీ కప్పు, టిఫిన్ ప్లేటు లోపల పెట్టి తలుపు వేద్దామని తలుపు దగ్గరికొచ్చిన జయ, తలుపు ప్రక్కన ప్రతాప్‌ను చూసి ఆశ్చర్యంగా,

''అరే! వచ్చేశారా! అంటే మీటింగ్ కాన్సిలయిందన్న మాట'' అంది సంతోషంగా లోపలికి దారితీస్తూ. ప్రతాప్ ఆమె మాటకు బదులు చెప్పకుండా లోపలికెళ్ళి కూర్చున్నాడు.

''కాఫీ తెస్తాను'' అంటూ లోపలికెళ్ళబోయిన జయను, కటువుగా ''అక్కర్లేదు'' అన్న ప్రతాప్ మాటకు బిత్తరపోయి వెనుదిరిగి ప్రతాప్‌ను చూసి మరింత బిత్తరపోయింది. ప్రతాప్ కళ్ళు, ముఖం కోపంతో ఎఱ్ఱబడ్డాయి. ప్రతాప్‌ను తనావిధంగా ఎప్పుడూ చూడలేదు.

''ఏం అయింది? ఎందుకలా వున్నారు?'' అంటూ కంగారుగా సమీపించి ''ఒంట్లో బాగాలేదా?'' అంటూ ప్రతాప్ చెంపలు ఆప్యాయంగా తాకి చూడబోయింది. మరుక్షణం ప్రతాప్ చేయి ఆమె చెంపను బలంగా తాకింది. ఎదురు చూడని పరిణామానికి ఆమె స్తంభించిపోయింది. అప్పుడే గుమ్మంలో అడుగుపెట్టిన ప్రీతి, అన్న ప్రవర్తనకు ఆశ్చర్యపోయింది. జయ బాధతో, అవమానంతో తన చెంపను తడిమి చూసుకుని, జరిగిన వాస్తవాన్ని నమ్మలేకపోయింది. తన ప్రతాప్ తనను కొట్టడమా? ఎందుకు? తనేం చేసిందని? ఆమెకు అంతా అయోమయంగా అనిపించింది. ఏదో అడగాలనుకుంది. కాని నోట మాటరాక ప్రతాప్‌ను చూస్తుండిపోయింది, చెంప నిమురుకుంటూ. మరలా ప్రతాపే,

''ఏం? నేను కొట్టినందుకు నీకు నొప్పిగా వుందా? మరి నీవు నా మనస్సు మీద కొట్టిన దెబ్బ? ఎవడు వాడు? నీ చేతులు పట్టుకుని ''నా ప్రేమను సార్థకం చేయాలి తప్పకుండా - అని అడిగింది'' అంటూ కోపంగా మరలా చేయెత్తబోయాడు. తనను తాకవచ్చిన చేతిని.

''ఆగండి!'' అంటూ పట్టుకుని ఆపింది జయ. ఆమె ''ఆగండి'' అని అరచిన అరుపుకు ప్రతాప్ బిత్తరపోయి చేయి వెనకకు తీసుకున్నాడు. జయ అవమానం వల్ల కలిగిన ఆవేశంతో ఊగిపోతూ రెండడుగులు ముందుకు వేసి,

''ఏంటన్నారు? ఎవ్వడు వాడు? అదా మీ అనుమానం? అందుకా చెంపదెబ్బ కొట్టారు? మీరు కొట్టిన దెబ్బ నా చెంపమీద కాదు. అది నా అభిమానం పైన కొట్టిన దెబ్బ. నన్ను మీరు అనుమానిస్తున్నారా? ఇన్నేళ్ళ దాంపత్య జీవితంలో మీరు అర్థం చేసుకుంది ఇంతేనా? మీరు ... మీరు ... నన్నెలా అపార్థం చేసుకోగలిగారు?'' అంది జయ మాటలు తడబడుతూ, అవమానం, ఆవేశం, బాధ ముప్పిరిగొనగా.

గుమ్మంలో నిలబడిన ప్రీతికి అప్పుడు ఏం జరిగిందో, అన్నయ్య తను చూసిన దృశ్యాన్ని, విన్న మాటలను ఎలా అపార్థం చేసుకున్నాడో అర్థమయింది. తను ఇంటికి వస్తున్నప్పుడు గేటు కవతల మధును చూసింది. మధు వదినను కలిసి మాట్లాడిన సంగతి చెప్పి,

''మీ వదినపై నాకు చాలా గౌరవభావం ఏర్పడింది. ఆ గౌరవంతోనే ఆమె చేతులు పట్టుకుని, నా ప్రేమను సార్థకం చేయాలి తప్పకుండా అని బతిమాలుకుని మరీ చెప్పాను. మన విషయం మీ అన్నయ్యకు చెప్పి మీ వదిన తప్పుకుఊండా సహాయం చేస్తారన్న నమ్మకం నాకేర్పడింది'' అని అన్నాడు. అలా ఆలోచిస్తున్న ప్రీతికి వెంటనే తన కర్తవ్యం బోధపడింది. తను వెంటనే వారిద్దరి మధ్య దూరబడి, ఇంకా విపరీతం జరగకుండా ఆపి, అన్నయ్యకు జరిగిన విషయం చెప్పి తను ఎలా అపార్థం చేసుకున్నాడో వివరించి చెప్పాలి. కాని ఎలా?'' అన్న ఆలోచన నుండి వాస్తవంలో కొచ్చేప్పటికి అన్నయ్య,

''ఏంటి? నేను నిన్ను అపార్థం చేసుకున్నానా? నేను ఎవ్వరో చూసిన దాన్ని, మరెవ్వరో చెప్పిన దాన్ని విని అపార్థం చేసుకోలేదు. నా కళ్ళారా చూశాను. నా చెవులారా విన్నాను. ఇది అబద్ధమవుతుందా?'' అంటున్నాడు.

ప్రీతి వెంటనే ''అన్నయ్యా!'' అంటూ అడ్డుపడింది. ''నేను చెప్పేది కాస్త వినండి'' అంటున్న ప్రీతిని ''నువ్వు తప్పుకో తల్లీ?'' అంటూ ఆమెను మాట్లాడనివ్వక ''ఏం? చెప్పు! అబద్ధమవుతుందా?'' అని రెట్టించి అడిగాడు.

''అవును. కొన్ని సందర్భాలలో మనం మన చెవులారా విన్నది, మన కనులారా చూసింది కూడా నిజం కాకపోవచ్చు. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళుకావు కొన్ని సందర్భాలలో. ఇప్పుడు మీరు చూసింది, విన్నది అలాంటిదే. అసలు మీలో సంస్కారముంటే, నా పట్ల అవగాహన, నమ్మకముంటే రాగానే నన్ను అతనెవరు? ఎందుకలా అడుగుతున్నాడు? అని దిగేవారు. ఆ విధంగా మీరు ఒక్క మాట అడుగుంటే మీకు అన్ని విషయాలు వివరించే దాన్ని. అలా కాక, మీకు అనుమాన పిశాచం ఆవరించి, మీరు చూసిన దాన్ని, విన్నదాన్ని మరో విధంగా అర్థం చేసుకుని నా మీద అనుమాన పడ్డారు. నా ... నా ... శీలాన్ని శంకించారు'' అని జయ అంటున్నప్పుడు ఆమె కన్నులు శ్రావణ మేఘాలయ్యాయి. ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకోటానికి ప్రయత్నిస్తూ,

''దాంపత్య జీవితంలో భార్య, భర్తల మధ్య వుండవలసిన ప్రేమ, అభిమానం, అవగాహన, అన్నింటికంటే ముఖ్యమైనది నమ్మకం. ఆ నమ్మకమే నా మీద మీకుంటే, మీరు చూసిన దాన్ని, విన్నదాన్ని నిజమని నమ్మేవారు కారు. విచక్షణతో, సంస్కారంతో నన్నూ అడిగి తెలుసుకునే వారు. మీకు నమ్మకం లేదు కాబట్టి చూసిన దాన్ని, విన్నదాన్ని నిజమనుకుని నా మీద అనుమాన పడ్డారు. నా అభిమానం మీద దెబ్బ తీశారు. ఆ నమ్మకం నా మీద, మీకు లేదని తెలిసినప్పుడు నేను ఇక్కడ వుండటంలో అర్థం లేదు'' అని అంటున్న జయ చేతులు పట్టుకుని,

''వదినా! అంతమాట అనకండి. ఇప్పటికైనా మించిపోలేదు. అన్నయ్యకు వాస్తవాన్ని చెప్పండి'' అని బ్రతిమాలింది ప్రీతి కళ్ళ నీళ్ళతో.



## పుట్టిన్రోజు తీర్మానాలు!



''ఈసారి పుట్టినరోజే జరుపుకోలేదు. ఇక కొత్త నిర్ణయాలేమీ తీసుకోలేదు. ధరల పెరుగుదల, విద్యుత్ రేట్ల పెంపువల్ల ప్రజలు ఇబ్బంది పడ్తున్నారు. నాకెంతో బాధగా వుంది. ఇలాగే వెళితే నేను సీరియస్‌గా తీసుకుంటాను. ప్రజల మనిషిని నేను. ఇది నా పర్సనల్ నిర్ణయం'' - అన్నది మరెవరో కాదు సూపర్ హీరోయిన్ విజయశాంతి.

''ప్రీతీ!'' అంటూ ఆమెను దగ్గరకు తీసుకుని కళ్ళనీళ్ళతో ఆమె నుదుటిని చుంబించి దృఢ నిశ్చయంతో, ఆత్మ విశ్వాసంతో గుమ్మం దాటింది జయ. ప్రీతి తల్లడిల్లిపోయి.

''వదినా! ఆగండి'' అంటూ వారిస్తూ

''అన్నయ్యా! దయచేసి వదినను ఆపండి. జరిగిన వాస్తవాన్ని నేను చెబుతాను'' అంటూ ప్రతాప్ కాళ్ళ పైనపడింది ప్రీతి. ప్రతాప్ చలించలేదు.

అనుమానపు గాలిదుమారం వల్ల మూసుకుపోయిన కనులను, ప్రతాప్ నెమ్మదిగా తెరచుకున్న తరువాత, ప్రీతి జరిగిన వాస్తవాన్ని చెపుతుంది.

అప్పుడతనేం చేస్తాడు?